'ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం'

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్

కామారెడ్డి, మార్చి 21 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని, కేంద్రం, ఈడీ దాడులను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్ ఖండించారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక మహిళా అని చూడకుండా అక్రమంగా ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా శంషాబాద్ నుంచి ఢిల్లీకి తరలించడం అమానుషమని అన్నారు. ఆమె అరెస్టును ఖండిస్తున్నామని తెలిపారు. ఆమెకు అండగా దళితులు నిలబడతారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామస్వామి, మండల అధ్యక్షుడు బసవరాజ్ సారయ్య, రాజు, లింగం, సురేశ్, సాయిలు, రమేశ్, బట్టు సరిత నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని

విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్ కుమార్

కామారెడ్డి, మార్చి 21 : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థిని అంకిత ప్రతిభ కనబరిచింది. గుజరాత్‌లోని దాద్రానగర్ హవేలీలో సీనియర్ బాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో కళాశాలలో బీఎస్సీ, ఎంపీసీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.నిఖిత ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను శాలువాతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, శంకరయ్య, రామస్వామి, రాజగంబీర్‌రావు, శారద, రాజేందర్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల దవాఖాన కోసం వినతి

దోమకొండ, మార్చి 21: మండల కేంద్రంలో ఉన్న 30 పడకల దవాఖానను 100 పడకల దవాఖానగా ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ గురువారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మండల నాయకులు అనంతరెడ్డి, రామస్వామిగౌడ్, సీతారాం మధు, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 21 : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అధికారుల కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలలో వ్యవయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించాల్సి ఉంటుందని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. అబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో సమీకృత చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రూ.10 లక్షల పైగా డబ్బు పట్టుబడితే ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. మూడు రోజుల్లో రూ.7.6 లక్షలు, గురువారం రూ.4.50 లక్షల నగదుతో పాటు 986 లీటర్ల ఐఎం, ఎఫ్ఎల్ మద్యాన్ని పట్టుకున్నాని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వో నిఖిత, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రమేశ్‌రాథోడ్, రంగనాథ్, ప్రభాకర్, బావయ్య, భార్గవ్, సుదీర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ

ఓటరుగా నమోదుకు యువతను ప్రోత్సహించాలి

కామారెడ్డి, మార్చి 21 : ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతను నూతన ఓటరుగా నమోదుతో పాటు ఓటింగ్ శాతం మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన స్వీప్ కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మరో మూడు శాతం మేర 18-19 ఏండ్ల లోపు యువతను ఓటరుగా నమోదు చేయడానికి అవకాశముందని, ఆ దిశగా వారిని ప్రోత్సహించి ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. 12 రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ మొదలైన మొదటి గంటలోనే భారీగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 22న వాక్‌టు పోలింగ్ బూత్ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. అదేవిధంగా 26న శాసనసభ సెగ్మెంట్‌లో 5కే రన్, 28న గోడలపై ఓటు ప్రాముఖ్యత తెలిపే ఫొటోలు, స్లోగన్ పెయింటింగ్‌లు వేయించనున్నామని తెలిపారు. నవ యువత, థర్ట్‌జెండర్లను ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎస్ఎస్ఎస్, ఎన్సీసీ, నెహ్రూ యువ కేంద్రం, కళాశాల లిటరసీ క్లబ్‌లను కోరారు.

ఎన్నికల బూత్‌ల పరిశీలన

బాన్సువాడ రూరల్, మార్చి 21 : మండలంలోని కొల్లూరు గ్రామంలో ఎన్నికల బూత్‌లను ఎంపీవో సత్యనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సృజన్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఎంపీవో తెలిపారు. ఈ కేంద్రాల్లో కల్పించాల్సిన సదుపాయాలు, సమస్యాత్మక కేంద్రాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిపారు. పార్టీల జెండాలు, ప్లెక్సీలు ఏమైనా ఉంటే తక్షణమే తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం

కామారెడ్డి, మార్చి 21 : జిల్లా కేంద్రంలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సామాజిక సమస్యలపై గురువారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెరవే ప్రతినిధులు మాట్లాడుతూ.. కవులు, రచయితలు దూరదృష్టితో రచనలు చేసి సమాజానికి ఆదర్శవంతమైన కవిత్వాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, కవి లచ్చయ్య, తెరవే ప్రతినిధులు మోహన్‌రాజ్, పీతాంబర్, గంగాప్రసాద్, రామచంద్రం, వకుళాభరణం, సుధాకర్, నర్సయ్య, నాగభూషణం, చంద్రకాంత్, సురేశ్ పాల్గొన్నారు.

కవితాగానం చేస్తున్న కవులు

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి, మార్చి 21 : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో కామారెడ్డి ముస్లిం మైనార్టీ పెద్దలతో రంజాన్ పండుగ పురస్కరించుకొని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ సమయంలోనే హోలీ పండుగ వస్తున్న సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రంజాన్ పండుగను ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బీబీపేట్, మార్చి 21 : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరుమాండ్లు, సభ్యులు కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పోలీసు తనిఖీల్లో రూ.95 వేలు సీజ్

నగదును సీజ్ చేసిన పోలీస్ అధికారులు

భిక్కనూరు, మార్చి 21 : భిక్కనూరు మండలం జాతీయ రహదారి 44పై టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ దగ్గర గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మెదక్ జిల్లాకు చెందిన ఈగ వెంకట్‌రెడ్డి వాహనంలో రూ.95 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

పిట్లం, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పిట్లం జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా స్క్వాడ్ అధికారి మహేశ్ మాట్లాడుతూ.. వాహన దారులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు.

చెక్‌పోస్టు ఏర్పాటు..

నిజాంసాగర్, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వెల్గనూర్ శివారులో జాతీయ రహదారిపై అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ సూపరింటెండెంట్ మనోహర్, పెద్దకొడప్‌గల్ ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ హన్మాండ్లు, నిజాంసాగర్ ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మూడు బృందాలను నియమించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సరైన ధ్రువ పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి డబ్బు తరలించొద్దని సూచించారు.

పంటనష్టంపై అధికారుల సర్వే

భిక్కనూరు, మార్చి 21 : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాధారెడ్డి, ఏఈవో అఖిల, రవి గ్రామంలో పర్యటించి పంట నష్టం వివరాలను రైతుల నుంచి సేకరించారు.

రామేశ్వరపల్లిలో పంట నష్టం వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కల్లు డిపోలపై దాడులు

దోమకొండ/బీబీపేట్, మార్చి 21: దోమకొండ, బీబీపేట్ మండలాల్లోని పలు కల్లు డిపోలపై ఎస్సైలు గణేశ్, ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. కల్తీకల్లు తయారు చేస్తున్న విషయం తెలుసుకొని తనిఖీలు నిర్వహించారు. కల్తీకల్లును పారబోశామని ఎస్సైలు తెలిపారు. కల్తీకల్లు తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక వాహనం సీజ్

డోంగ్లీ, మార్చి 21: మండలంలోని కుర్ల ప్రాంతంలో మంజీరా నది నుంచి బుధవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వాహనాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశువులకు టీకాలు

బిచ్కుంద/నస్రుల్లాబాద్, మార్చి 21: మండలంలోని గోపన్‌పల్లి గ్రామంలో 44 ఆవులు, 86 గేదెలకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని డాక్టర్ భాస్కరన్ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సాయిలు, రైతులు పాల్గొన్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో పశువులకు ఏడీ రోహిత్‌రెడ్డి గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డాక్టర్లు మారుతి, జైపాల్ సింగ్, సిబ్బంది మహబూబ్, తుకారాం,రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I,SUSHEEL KUMAR S/O NALLANNA H.NO:1-98,GOVINDPET,ARMOOR(M), NZB(D) ,CHANGED MY SURNAME & NAME AS BANTU SUSHEEL KUMAR

NTZ-324632

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీసీ రాధాకృష్ణన్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పిట్లం మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర సభ్యుడు సంజీవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

-పిట్లం, మార్చి 21

'జుక్కల్'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

■ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/బిచ్కుంద, మార్చి 21: జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. వివిధ మండలాల నుంచి వచ్చిన వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బిచ్కుంద మండలం హస్గుల్‌లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నడవలేని వారికి ఇంటి వద్దే ఓటేసే అవకాశం

ఎల్లారెడ్డి/పిట్లం, మార్చి 21 : పూర్తిగా నడువలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, 85 ఏండ్లు పైబడిన వృద్ధులకు పార్లమెంటు ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఎల్లారెడ్డి, పిట్లం తహసీల్దార్లు మహేందర్ కుమార్, వేణు తెలిపారు. ఆయా తహసీల్ కార్యాలయాల్లో గురువారం బీఎల్వోలతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. బీఎల్వోలు తమ పరిధిలో పర్యటించి అంధులు, నడువలేని వారు, వృద్ధులను గుర్తించి ఫారం-12డీ ద్వారా దరఖాస్తు చేయించాలన్నారు. సమావేశాల్లో ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐలు శీతల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్కాపూర్‌లో మెగా వైద్య శిబిరం

మాచారెడ్డి, మార్చి 21 : మండలంలోని అక్కాపూర్‌లో జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 300 మందికి కంటి, గుండె, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మాచారెడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి సతీశ్, రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్ బుచ్చిరెడ్డి, మండల వైర్మన్ నవీన్‌రెడ్డి, రమేశ్, గడ్డం బాబు, ఎల్లయ్య, నారాయణ, బాల్‌నర్సు, బాల్‌రాజు, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రామారెడ్డి, మార్చి 21: మండలకేంద్రంతోపాటు రెడ్డిపేట, ఉప్పల్‌వాయి గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, నకిలీవి అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి హరీశ్‌కుమార్ ఉన్నారు.

రామారెడ్డిలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి

స్వయం సహాయక సంఘం డబ్బులు స్వాహా

నిజాంసాగర్, మార్చి 21: మండలంలోని స్వయం సహాయక సంఘాల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. హసన్‌పల్లి సంఘానికి చెందిన రూ. 27లక్షలను మాయం చేసిన ఘటన జిల్లాలో ఇప్పటికే చర్చనీయాంశం కాగా, మరో సంఘ అధ్యక్షురాలు తన చేతివాటం ప్రదర్శించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యులు చెల్లించిన లక్షా 50వేల రూపాయలను అధ్యక్షురాలు ప్రతినెలా బ్యాంకులో జమ చేయకుండా పాత రసీదులపైనే తేదీలను మార్చి సొంత అవసరాలకు వాడుకున్నది. ఈ విషయం బయటికి రావడంతో రూ. 50వేలు చెల్లించింది. మిగిలిన డబ్బులను వారం రోజుల్లో ఇస్తానని తెలిపింది. హసన్‌పల్లి మహిళా సంఘం డబ్బుల విషయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినా ఇప్పటివరకు సభ్యులకు న్యాయం జరుగలేదు. కష్టపడి పొదుపు చేసుకుంటున్న డబ్బులను ఇలా కొందరు అప్పనంగా మింగేయడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బిచ్కుంద, మార్చి 21: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండ చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాడైన బోర్లను వెంటనే రిపేర్ చేయించాలన్నారు. ఉపాధి పనులకు కూలీల హాజరును పెంచాలని సూచించారు.

అమ్మఒడి వైద్య పరీక్షలు

సదాశివనగర్, మార్చి 21 : అమ్మఒడి పథకంలో భాగంగా మండలకేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో గురువారం తల్లీ బిడ్డలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖాన సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

బాన్సువాడ, మార్చి 21 : పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గండివేట్ తండాకు చెందిన చందర్‌నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడలో సామన్లు కొనుగోలు చేస్తున్నారు. పక్కనే ఉన్న చెప్పుల దుకాణంలో చెప్పులు కొనుగోలుకు వెళ్లి తిరిగి రాజీవ్ గాంధీ చౌరస్తా వైపు వస్తున్నాడు. ఎల్లారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చందర్‌నాయక్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించగా తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

కామారెడ్డి/దోమకొండ/బీబీపేట్/ఎల్లారెడ్డి రూరల్, మార్చి 21 : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఇంగ్లిష్ పేపర్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 62 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 11,962 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 11,940 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. నలుగురు ప్రైవేట్ విద్యార్థులకు ఇద్దరు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు. దోమకొండలోని బాలుర ఉన్నత పాఠశాలలోని సెంటర్‌లో 162 మంది, బాలికల ఉన్నత పాఠశాలలోని సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. బీబీపేట్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న రెండు పరీక్షా కేంద్రాల్లో సెంటర్ (ఎ)లో 180 మంది, సెంటర్ (బి)లో 170 మంది విద్యార్థులు, మాందాపూర్ సెంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో కార్యాలయ తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మూడు పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు డీఈవో రాజు తనిఖీ చేశారు. గురువారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 702 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారని ఎంఈవో వెంకటేశ్ తెలిపారు.

అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతాలు

రాజంపేట్, మార్చి 21 : మండలంలోని కొండాపూర్ క్లస్టర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ బీ.. పడాయి బీ.. కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాశన చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత మాట్లాడుతూ.. ఏ ఒక్కరిలో పోషకాహార లోపం కనిపించకూడదని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యవతి, శ్రీలత, సుశీల, శారద, గ్రామ సెక్రటరి శ్రీజ, మండల సమాఖ్య కోశాధికారి లావణ్య, కొండాపూర్ గ్రామ సంఘం సెక్రటరీ మణెవ్వ, సీసీ బాగయ్య, ఆశ వర్కర్ సవిత, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

అటవీ శాఖ అధికారుల ర్యాలీ

రామారెడ్డి, మార్చి 21: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండలంలోని రామారెడ్డి, రెడ్డిపేట సెక్షన్ అధికారులు ఆయా గ్రామాల్లో గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల ఆవశ్యకత, చెట్లను నరికేస్తే కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అడవులను కాపాడుకోవాలని సూచించారు. సెక్షన్ ఆఫీసర్లు శంకర్‌రెడ్డి, జయశ్రీ, బీట్ ఆఫీసర్లు శ్రీధర్, సుధీర్, శేఖర్, రమాలీల పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ..

కామారెడ్డి, మార్చి 21 : జిల్లా కేంద్రంలోని డెయిలీ మార్కెట్‌లో ఓ అమ్మాయి ఆటోలో ప్రయాణించి తన పర్సును మర్చిపోయింది. ఆ ఆటో డ్రైవర్ మహ్మద్ సిరాజ్ ఆ పర్సుని కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశాడు. పోగొట్టుకున్న పర్సులో రూ.1,100 ఉన్నాయని సీఐ తెలిపారు. అనంతరం సిరాజును శాలువాతో సత్కరించి అభినందించారు.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

నస్రుల్లాబాద్, మార్చి 21 : బీర్కూర్‌లో చేపట్టిన కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణ పనులను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఎంపీపీ రఘు పరిశీలించారు. రూ.2కోట్ల 90 లక్షల నిధులు మంజూరుకాగా ఇప్పటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో గుత్తేదారుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సందీప్, పాఠశాల ప్రిన్సిపాల్ గీత, నాయకుడు మన్నాన్ ఉన్నారు.

లైబ్రరీకి స్టడీ ప్యాడ్‌ల అందజేత



స్టడీ ప్యాడ్‌లను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బిచ్కుంద, మార్చి 21: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులు చదువుకోవడానికి వీలుగా ఉండేందుకు లయన్స్ క్లబ్-భూమి ఆధ్వర్యంలో గురువారం 20 స్టడీ ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులకు పాఠకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ శివ నాగేశ్వర్‌రావు, సెక్రటరీ నర్సయ్య, జోన్ చైరపర్సన్ ఓంప్రకాశ్, సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృత